## క్లుప్తంగా

### కాలనీల్లో ఫాగింగ్



ఫాగింగ్ చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

సుల్తానాబాద్: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు కాలనీల్లో ఆటో ద్వారా ప్రత్యేక ఫాగింగ్ చేస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత మేనేజర్ అలీముద్దీన్ తెలిపారు. ఈ మేరకు మున్సిపల్ సిబ్బందితో సుల్తానాబాద్, పూసాల, సుగ్లాంపల్లిలో ఫాగింగ్ చేయించడంతో పాటు నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో నీటిని తొలగించారు.

### వాకర్స్‌కు ఇబ్బంది కలగకుండా చర్యలు



సుల్తానాబాద్: సుల్తానాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట ఉన్న గ్రౌండ్ వర్షానికి గుంతలు పడడంతో పాటు రాళ్లు తేలాయి. దీంతో వాకర్లు ఇబ్బంది పడుతున్నారని పెద్దపల్లి ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి దృష్టికి మాజీ జెడ్పీటీసీ ఐల రమేశ్, బీఆర్ఎస్ నాయకులు ముత్యం రమేశ్‌గౌడ్ తీసుకువెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే వాకర్స్‌కి ఇబ్బందులు కలగకుండా లారీల ద్వారా మట్టిని సరఫరా చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత సిబ్బంది చదును చేయించారు.

### సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న నాయకులు

కమాన్‌పూర్: మండలంలోని పెంచికల్‌పేట గ్రామానికి చెందిన జంపాల మధునమ్మకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.10వేల విలువ గల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును ఆదివారం బీఆర్ఎస్ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కిషన్ రెడ్డి, సర్పంచ్ కొండ వెంకటేశ్, నాయకులు ఎద్దు రాజయ్య, రాసకొండ రవి, బైరి అంజయ్య, గండికోట రాములు, భూతపల్లి కిట్టు, ఐట్ల పవన్ పాల్గొన్నారు.

### స్నేహితుల ఔదార్యం



చెక్కు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

పాలకుర్తి: బసంత్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1993–94 బ్యాచ్ విద్యార్థులు తమ తోటి స్నేహితురాలికి ఆర్థికసాయం అందించి ఔదార్యాన్ని చాటుకున్నారు. చిన్నప్పుడు తమతో కలిసి చదువుకున్న స్నేహితురాలు కుమారి కుటుంబం ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న తోటి స్నేహితులందరూ కలిసి రూ.40వేలు విరాళాలుగా సేకరించారు. ఈ మేరకు ఆదివారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నగదు అందజేశారు.

### కాపు కార్పొరేషన్ ఏర్పాటుకు పోరాటం



మాట్లాడుతున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వం మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసేదాకా పోరాటం సాగిస్తామని రాష్ట్ర అపెక్స్ కౌన్సిల్ కన్వీనర్ పురుషోత్తంరావు అన్నారు. పెద్దపల్లిలో ఆదివారం ఏర్పాటు చేసిన మున్నూరుకాపు సమావేశంలో మాట్లాడారు. మున్నూరుకాపులు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగాలన్నారు. మున్నూరుకాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసేలా ప్రభుత్వం ఒత్తిడి పెంచేలా కార్యచరణ చేపడదామన్నారు. నాయకులు కుమార్ పటేల్, అమిరిశెట్టి రామస్వామి, ఆకుల వివేక్, తూముల శ్రీనివాస్ ఉన్నారు.

**నేడు బీసీబంధు చెక్కుల పంపిణీ**

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి నియోజకవర్గం పరిధిలోని లబ్ధిదారులకు సోమవారం బీసీబంధు చెక్కులు పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు బీసీ సంక్షేమశాఖ అధికారి రంగారెడ్డి తెలిపారు. పట్టణంలోని నందన గార్డెన్‌లో జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి చెక్కులు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

# అందరికీ అందని రైతుబంధు

- ఐదెకరాల్లోపు వారికే ఖాతాల్లో జమ
- మిగతా రైతులకు తప్పని ఎదురుచూపులు



ఈ ఫొటోలో ఉన్న రైతు బత్తుల శ్రీనివాస్‌ది ధర్మారం మండలం పెర్కపల్లి గ్రామం. ఈయన నాలుగు ఎకరాలలో వరిపంట, ఎకరం 20 గుంటలలో పత్తి సాగుచేశారు. రైతుబంధు సాయం ఇంకా అందకపోవటంతో పెట్టుబడి కోసం ప్రైవేటు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పు తెచ్చుకున్నాడు. నెలలు గడుస్తున్నా పెట్టుబడి సాయంం ఖాతాలో జమ కాకపోవటంతో ఆందోళన చెందుతున్నాడు. ఇతనొక్కడే కాదు.. మండలంలో చాలా మంది రైతులది ఇదే పరిస్థితి.



ధర్మారం మండల వ్యవసాయ కార్యాలయం

ధర్మారం: రైతుబంధు పథకంలో భాగంగా రైతులకు అందిస్తున్న పెట్టుబడి సాయం ఐదెకరాల్లోపు వరకే అందింది. అంతకు మించి గుంట భూమి అదనంగా ఉన్న రైతులకు సాయం అందకపోవడంతో నెలరోజులుగా వారికి ఎదురుచూపులు తప్పడం లేదు.

**1756 మందికి జమ కాలేదు..**

ధర్మారం మండలంలోని 29 గ్రామపంచాయతీల్లో 16 రెవెన్యూ గ్రామాలున్నాయి. ఈ 16 రెవెన్యూ గ్రామాల్లో 17,791 మంది రైతులు రైతుబంధు పథకానికి అర్హులుగా ఉండగా ఇప్పటి వరకు 16,035 మంది రైతులకు మాత్రమే రైతుబంధు సాయం ఆయా రైతుల బ్యాంకు ఖాతాలో ప్రభుత్వం జమచేసింది. మిగతా 1756 మంది రైతులు రైతుబంధు సాయం కోసం ఎదురుచూస్తున్నారు. మండలానికి 14.86కోట్లు ప్రతి సీజన్‌కు ప్రభుత్వం పెట్టుబడి సాయంగా మండల రైతులకు అందిస్తుంది. అయితే ఈ సీజన్‌లో రూ.11.51కోట్లు రైతుల ఖాతాలో జమ చేసింది. ప్రస్తుతం సాగు పనులు ఊపందుకోవడంతో రైతుబంధు అందని వారంతా ఇబ్బందులకు గురవుతున్నారు. పెట్టుబడి కోసం వడ్డీ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు.

**ఐదెకరాల్లోపు వారికే..**

ధర్మారం మండలంలో రైతులకు రైతుబంధు సాయం అందించేందుకు వ్యవసాయశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. జూన్ 20 నుంచి ఐదెకరాల్లోపు ఉన్నవారికి ఎకరాకు రూ.5వేల చొప్పున రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమచేసింది. ఐదెకరాలకు పైబడిన రైతులంతా సాయం కోసం ఎదురుచూస్తున్నారు.

### అప్పు చేయాల్సి వచ్చింది



రైతుబంధు కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. బ్యాంకులో డబ్బులు పడిన తర్వాత సెల్ మెసేజ్ వస్తుందనే ఆశతో చూస్తున్నాం. రైతుబంధు డబ్బులు బ్యాంకు ఖాతాలో పడకపోవటంతో ప్రైవేటుగా అప్పులు చేయాల్సి వస్తోంది. వెంటనే రైతుబంధు డబ్బులు రైతుల ఖాతాలో జమ చేయాలి.

– ఈదుల రాంగోపాల్‌రెడ్డి, కటికెనపల్లి

### రైతులు ఆందోళన చెందొద్దు



రైతుబంధుకు అర్హులైన వారందరికీ పెట్టుబడి సాయం తప్పకుండా అందుతుంది. ఇందుకు వ్యవసాయశాఖ అర్హులైన వారందరి జాబితాను ప్రభుత్వానికి పంపింది. కొంత ఆలస్యమైనా ప్రతి రైతు ఖాతాలో రైతుబంధు జమ అవుతుంది. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

– పూర్ణిమ, వ్యవసాయశాఖ అధికారి, ధర్మారం

# ప్రతి ఇంటిపై జాతీయజెండా ఎగరాలి

పెద్దపల్లిరూరల్: స్వాతంత్య్ర దినోత్సవం రోజున ప్రతి ఒక్కరూ తమ ఇంటిపై జాతీయజెండా ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి కోరారు. మున్సిపల్ ఆఫీసులో ఆదివారం జెండాలను వార్డుల వారీగా పంపిణీ చేశారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ జాతీయ జెండా అందించాలని మెప్మా సిబ్బందిని ఆదేశించారు. కమిషనర్ వెంకటేశ్, మేనేజర్ శివప్రసాద్ ఉన్నారు. 8వ వార్డులో కౌన్సిలర్ భాగ్యలక్ష్మి ఇంటింటికీ వెళ్లి జెండాలు అందించారు.

**జాతీయ జెండాల పంపిణీ**

సుల్తానాబాద్: సుల్తానాబాద్ మున్సిపల్ పరిధిలో స్థానిక సిబ్బందితో పాటు కౌన్సిలర్లు ఇంటింటా జాతీయ జెండాల పంపిణీ ఆదివారం ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత, వైస్ చైర్‌పర్సన్ బిరుదు సమత, కౌన్సిలర్ గొట్టం లక్ష్మి సిబ్బందితో ఇంటింటా జాతీయ జెండాలను పంపిణీ చేశారు. పట్టణంలో 15 వార్డుల్లోని జాతీయ జెండా గద్దెలను కార్మికులు శుభ్రం చేశారు.

జూలపల్లి: మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో జూలపల్లి మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో వేణుగోపాల్ రావు జాతీయ జెండాలు అందజేశారు. ఆగస్టు15న ఇంటింటా జాతీయ జెండా ఎగురవేసుకునేందుకు గ్రామాల్లో ఇంటింటా జాతీయ జెండాలను కార్యదర్శులు, పంచాయతీ కార్యదర్శులు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో పేర్కొన్నారు.



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ మమతారెడ్డి



సుల్తానాబాద్‌లో జాతీయ జెండాల పంపిణీ

ఎలిగేడు: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని గ్రామగ్రామాన ఇంటింటా జాతీయ జెండాలు ఎగురవేసేలా ఆదివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, ఎంపీవో అనిల్‌రెడ్డి జాతీయ జెండాలు పంపిణీ చేశారు. జాతీయ జెండాలను గ్రామాల్లో ఇంటింటికీ పంపిణీ చేస్తున్నారు. మండలంలోని 12గ్రామాల్లో 7వేల పైచిలుకు గృహాలకు జాతీయ జెండాలు పంపిణీ చేయనున్నట్లు ఎంపీవో అనిల్‌రెడ్డి తెలిపారు.

ఓదెల: మండలంలో ఇంటింటా జాతీయ జెండా ఎగురవేయాలని ఎంపీడీవో జి.సత్తయ్య కోరారు. మండలపరిషత్ కార్యాలయంలో ఆదివారం జాతీయ జెండాలను కార్యదర్శులకు పంపిణీ చేశారు.

### ఎన్నికలపై అవగాహన ఉండాలి

సుల్తానాబాద్: విద్యార్థులు ఎన్నికలపై అవగాహన కలిగి ఉండాలని సుల్తానాబాద్ సెయింట్ మేరీస్ పాఠశాల కరెస్పాండెంట్ తుమ్మ అశోక్‌రెడ్డి అన్నారు. పాఠశాలలో క్లాస్‌కి ఒకరిని లీడర్‌గా ఎన్నుకునేందుకు ఆదివారం విద్యార్థులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓట్లలో గెలుపొందిన విద్యార్థులను లీడర్‌గా ఎన్నుకున్నారు. కార్యక్రమం తర్వాత గెలుపొందిన వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. పాఠశాల కరెస్పాండెంట్ తుమ్మ అశోక్ రెడ్డి, అసిస్టెంట్ ఫాదర్ వినయ్, పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.




విద్యార్థులతో కరస్పాండెంట్ అశోక్‌రెడ్డి

### గద్దర్‌కు నివాళి



నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కమాన్‌పూర్: మండల కేంద్రంలో ప్రజాగాయకుడు తెలంగాణ ఉద్యమ నేత గద్దర్‌కు కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో ఆదివారం నివాళి అర్పించారు. గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మల్యాల తిరుపతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు కోలేటి మారుతి, మాల్యాల రాంచంద్రంగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వైనాల రాజు, నాయకులు రంగు సత్యనారాయణ, భూంపెల్లి రాజయ్య, సర్పంచ్ ఆకుల ఓదెలు, జెమినిగౌడ్, బాద్రపు శంకర్, ముస్తాక్ పాల్గొన్నారు.

### ట్రేడ్ యూనియన్ల భవిష్యత్ కనుమరుగు

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి సంస్థలో రాజకీయ జోక్యం పెరగడంతో సింగరేణి కార్మిక సంఘాల భవిష్యత్ కనుమరుగు అవుతుందని టీడీపీ రామగుండం నియోజకవర్గం ఇన్‌చార్జి, టీఎన్‌టీయూసీ యూనియన్ సింగరేణి విభాగం అధ్యక్షుడు పెద్దపల్లి సత్యనారాయణ ఆరోపించారు. యైటింక్లయిన్ కాలనీ ప్రెస్‌భవన్‌లో ఆదివారం మాట్లాడారు. కార్మికుల సంక్షేమానికి ఉపయోగించే సింగరేణి నిధులను సింగరేణికి సంబంధించిన ప్రాంతాల్లో కాకుండా ఇష్టారీతిలో ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం ఖర్చు పెడుతున్నారన్నారు. అనంతరం ఆర్జీ–2 వైస్ ప్రెసిడెంట్‌గా శివ మల్లయ్య, ఆర్జీ–3 వైస్ ప్రెసిడెంట్‌గా బొగ్గుల చిన్నయ్యను ఎన్నుకున్నట్లు ప్రకటించి నియామక పత్రాలు అందజేశారు. నాయకులు కోటగిరి పాపయ్య, రాజు, టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎండీ వాజిద్, రవీందర్, శ్రీను, మల్లయ్య, చిన్నయ్య, రాజలింగం, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### గద్దర్ మృతి విప్లవ ఉద్యమానికి తీరని లోటు

కాల్వశ్రీరాంపూర్: ప్రజా గాయకుడు గద్దర్ మృతి విప్లవ ఉద్యమానికి తీరని లోటని సీపీఎం వ్యవసాయ కార్మికశాఖ జిల్లా అధ్యక్షుడు మంద రాజేందర్ అన్నారు. కాల్వశ్రీరాంపూర్‌లో గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి సంతాపం ప్రకటించారు.

## సంక్షిప్త వార్తలు

**✦ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు**

ఓదెల: మండలంలోని మడక గ్రామంలో ట్రాన్స్‌కో ఏఈఈ మోహన్‌నాయక్ ఆధ్వర్యంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. గ్రామంలోని పంటపొలాల సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో రైతులు సమాచారం అందించారు. 50ఎకరాల పంటపొలాలు ఎండిపోకుండా వెంటనే స్పందించి ఏఈఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. రైతులు గొర్ల రాజకొమురయ్య, నంద క్రాంతికుమార్, ఆవుల రవీందర్, నోముల సదారెడ్డి, శ్రీనివాస్, రమేశ్, నోముల ప్రతాప్‌రెడ్డి, సింగారపు అయిలయ్య ఏఈఈకి కృతజ్ఞతలు తెలిపారు.

**✦గట్టెపల్లిలో గడపగడపకు కాంగ్రెస్**

సుల్తానాబాద్‌రూరల్: బీఆర్ఎస్ నిరంకుశ పాలనను ప్రజలు వ్యతిరేకించాలని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ మండలం గట్టెపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి గడపగడపకు కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయరమణారావు ఇంటింటికీ తిరుగుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాల గురించి వివరించడంతో పాటు కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ప్రజలకు చేసే సంక్షేమ పథకాల గురించి వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం హామీలు ఇచ్చుడే తప్ప.. క్షేత్రస్థాయిలో అమలు చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు.

**✦దరఖాస్తులు ఆహ్వానం**

రామగుండం: పట్టణంలోని ఆదర్శ(మోడల్) విద్యాలయంలో హవర్లీ బేస్డ్ ప్రాతిపదికన విద్యాబోధన చేసేందుకు ఔత్సాహికులైన నిరుద్యోగ విద్యావంతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శనివారం ప్రిన్సిపాల్ సారాతస్నీమ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కెమిస్ట్రీ సబ్జెక్టులో బోధించేందుకు పీజీటీ పోస్టు హవర్లీ బేస్డ్ ప్రాతిపదికన నియమించనున్నట్లు తెలిపారు. ఎమ్మెస్సీ కెమిస్ట్రీ/బీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందన్నారు. అభ్యర్థులు పూర్తి వివరాలతో 16లోగా ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంటలోగా నేరుగా ప్రిన్సిపాల్‌ను సంప్రదించాలని సూచించారు.

**✦మోడల్ స్కూల్‌లో..**

ముత్తారం: మండలంలోని మోడల్ స్కూల్, కాలేజీలో టీజీటీ సోషల్, పీజీటీ కెమిస్ట్రీ పోస్టులకు హవర్ బేసిక్స్ ప్రాతిపదికన పనిచేసే అర్హత గల టీచర్ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వీఎస్‌వీ రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత గల వారు ఒరిజినల్, జిరాక్స్ ధ్రువప్రతలతో సోమవారం డెమాక్లాసుకు హాజరు కావాలని సూచించారు.

### అధిక తేమతో పత్తిపంటకు నష్టం



కుళ్లిపోయిన కానిగంటి పోశాలు పత్తిపంట

ఓదెల: మండలంలో పత్తిపంటకు ఉప్పెన ముప్పు వాటిల్లింది. ఇటీవల మండలంలో కురిసిన భారీవర్షాలతో నేలంతా తేమతో ఉండటంతో పత్తి మొక్కలు పూర్తిగా కుళ్లిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని ఓదెలకు చెందిన కానిగంటి పోశాలు రైతుకు చెందిన ఎకరం భూమిలో సాగుచేసిన పత్తిపంట పూర్తిగా కుళ్లిపోయింది. రూ.రూ20వేల పెట్టుబడితో సాగుచేసిన పత్తిపంట పూర్తిగా మట్టిలో కలిసిపోవడంతో నష్టపోయినట్లు రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

# అవయవదానం చేద్దాం.. ప్రాణాలు కాపాడుదాం



మాట్లాడుతున్న లింగమూర్తి

యైటింక్లయిన్‌కాలనీ: నేత్ర, శరీర, అవయవ దానాలు చేసి ప్రాణాలను కాపాడుదామని సదాశయ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి సీహెచ్ లింగమూర్తి అన్నారు. అవయవదాన దినోత్సవం సందర్భంగా ఆదివారం సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్జీ–2 ఏరియా ఎస్ఎంఎస్ ప్లాంట్ ఉద్యోగులు, కార్మికులతో నిర్వహించిన సమావేశంలో లింగమూర్తి పాల్గొని నేత్ర, శరీర, అవయవ దానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎస్ఎంఎస్ ప్లాంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ నూక రమేశ్, రాములు, నర్సింహచారి, ప్లాంట్ సూపర్‌వైజర్ పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణకు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం

ఎలిగేడు: నేరాల నియంత్రణకు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు సుల్తానాబాద్ సీఐ జగదీష్ అన్నారు. జూలపల్లి పోలీసుస్టేషన్ పరిధిలోని ఎలిగేడు మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం సుల్తానాబాద్ సీఐ, జూలపల్లి ఎస్సై వెంకటకృష్ణ ఆధ్వర్యంలో 20మంది పోలీసులతో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించి స్థానిక ప్రజలతో మాట్లాడారు. గ్రామాల్లో కొత్త వ్యక్తులు షెల్టర్ తీసుకుని ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలున్నా పోలీసుల దృష్టికి తీసుకురావాలని, లేదంటే డయల్ 100కు కాల్ చేయాలని సూచించారు. ప్రతిఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు తప్పక పాటించాలని, వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. గ్రామంలో సరైన పత్రాలు లేని 545 బైకులు, నాలుగు ఆటోలను సీజ్ చేసినట్లు సీఐ వెల్లడించారు. ఉపసర్పంచ్ కోరుకంటి వెంకటేశ్వర్‌రావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సీఐ జగదీష్

**మెగా రక్తదాన శిబిరంలో పాల్గొనాలి**

సుల్తానాబాద్‌రూరల్: సుల్తానాబాద్‌లో చేపట్టనున్న మెగా రక్తదాన శిబిరంలో రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని సీఐ జగదీష్ అన్నారు. పట్టణంలో శ్రీవాణి కళాశాలలో ఆదివారం మండలంలోని ఆర్ఎంపీ, పీఎంపీలతో సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ రామగుండం సీపీ ఆధ్వర్యంలో త్వరలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. యువత, సామాజిక కర్యకర్తలు చైతన్యపరిచి రక్తదానం చేసేలా ప్రోత్సహించాలని కోరారు. సమావేశంలో ఎస్సై విజేందర్ ఉన్నారు.

# పంటపొలాల పక్కన డంపింగ్‌యార్డు



హరిపురంలో పొలాల పక్కనే ఉన్న డంపింగ్‌యార్డు

ఓదెల: మండలంలోని డంపింగ్‌యార్డులు పచ్చనిపైర్లకు గండంగా మారాయి. హరిపురం–ఓదెల గ్రామాల్లోని శివారులో డంపింగ్‌యార్డును ఏర్పాటు చేయటంతో పచ్చనిపైర్లకు వ్యర్థాల మురికినీరు సోకడంతో పంటలకు నష్టం కలుగుతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హరిపురం నుంచి ఓదెల, పొత్కపల్లికి వెళ్లే ప్రధాన రహదారికి పక్కన డంపింగ్‌యార్డు ఏర్పాటు చేయడంతో వర్షాలతో మురిగిపోయి తీవ్రదుర్గంధం వెదజల్లుతోంది. చెత్త చెదారం అంతా డంపింగ్‌యార్డులో వేయడంతో కాలుష్యం ఏర్పడి పంటపొలాలు పూర్తిగా పాడయ్యే అవకాశం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డంపింగ్‌యార్డును దూరప్రాంతాలకు తరలించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# రాజకీయ యుద్ధభేరికి తరలిన పద్మశాలీలు



యైటింక్లయిన్‌కాలనీ: తరలివెళ్తున్న నాయకులు



జూలపల్లి: సభకు వెళ్తున్న సభ్యులు

గోదావరిఖనిటౌన్: కోరుట్లలో జరిగిన రాజకీయ యుద్ధభేరికి గోదావరిఖని నుంచి పద్మశాలీ కులసంఘం సభ్యులు బస్సుల్లో తరలివెళ్లారు. ఈ సందర్భంగా కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి కోరుట్లకు దాదాపు 30 వాహనాల్లో వెళ్లారు. పద్మశాలీ సంఘం జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి అందె సదానందం, కార్పొరేటర్ మంచికట్ల దయాకర్, జిల్లా ఉపాధ్యక్షుడు అనుమ రాజమల్లు, వల్లకట్ల రాజేశం, కార్పొరేటర్లు మంచికట్ల దయాకర్, కొలిపాక సుజాత, బాల రాజుకుమార్, నాయకులు ఆడెపు శంకర్, సత్యనారాయణ, దామోదర్, మల్లయ్య, రాజేశ్, చక్రపాణి, ప్రభాకర్, వెంగళబాబు, అనుమ భద్రయ్య, నంబయ్య, రాములు, నర్సయ్య, శ్రీనివాస్ ఉన్నారు.

పద్మశాలీ గర్జన సభకు తరలిన నాయకులు

యైటింక్లయిన్‌కాలనీ: మచికట్ల దయాకర్ ఆధ్వర్యంలో యైటింక్లయిన్ కాలనీ పద్మశాలీ సేవా సంఘం నాయకులు ఆదివారం తరలివెళ్లారు. తరలి వెళ్లిన వారిలో జిల్లా అధ్యక్షుడు రాజేశ్, కాలనీ సంఘం అధ్యక్షుడు చక్రపాణి, ప్రభాకర్, శ్రీనివాస్, మహేశ్, ప్రకాష్, రాములు, సత్యనారాయణ ఉన్నారు.

ఓదెల: కోరుట్లలో ఆదివారం తలపెట్టిన పద్మశాలీ రాజకీయ యుద్ధభేరి ఆత్మగౌరవ సభకు మండలం నుంచి నాయకులు పెద్దసంఖ్యలో తరలివెళ్లారు. మండలంలోని కొలనూర్, ఓదెల, పొత్కపల్లి, కనగర్తి, గుంపుల గ్రామాల నుంచి 2వేల మంది తరలివెళ్లారు. నాయకులు చీకట్ల మొండయ్య, పర్శ రమేశ్, డాక్టర్ భీష్మాచారి, కొమురయ్య, వెంకన్న, ప్రసాద్, వలకట్ల శ్రీనివాస్ ఉన్నారు.

రామగిరి: కోరుట్లలో జరిగిన పద్మశాలీ రాజకీయ యుద్ధభేరి ఆత్మగౌరవ సభకు ఆదివారం పద్మశాలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొలిపాక సత్తయ్య ఆధ్వర్యంలో బయలుదేరివెళ్లారు. రామ్మూర్తి, సదానందం, సారయ్య, వెంకటేశ్వర్లు ఉన్నారు.

జూలపల్లి: జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్ ఆధ్వర్యంలో 200మంది సభ్యులు నాలుగు వాహనాల్లో తరలివెళ్లారు. చిప్ప శ్రీకాంత్, దీకొండ అంజనేయులు, జనార్దన్, రమేశ్, రాయమల్లు, దిడ్డి శంకరయ్య, యాదగిరి, మహేశ్, అంజనేయులు, శ్రీనివాస్, శంకరయ్య ఉన్నారు.

ఎలిగేడు: కోరుట్లలోని కీర్తి ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం నిర్వహించిన పద్మశాలీ రాజకీయ యుద్ధభేరికి ఎలిగేడు మండలంలోని అన్ని గ్రామాల నుంచి ఎలిగేడుకు చేరుకుని మండల కేంద్రం నుంచి పద్మశాలీ కులసంఘం నాయకులు కోరుట్లకు బయలుదేరారు. సర్పంచ్ సింధూజ, మామిడాల రమేశ్, వెంకటసత్యం, మాజీ ఎంపీటీసీ సత్యనారాయణ, తిరుపతి, వెంకటేశం, రాజమల్లయ్య ఉన్నారు.

### కొలనూర్‌లో వనభోజనాలు

ఓదెల: మండలంలోని కొలనూర్ గ్రామస్తులు వనభోజనాలకు వెళ్లారు. గ్రామంలోని సబ్‌స్టేషన్ కాలనీ, రెడ్డికాలనీవారు సమ్మక్కగుట్టల సమీపంలో వనభోజనాలకు కుటుంబ సమేతంగా వెళ్లారు. కుటుంబ సభ్యులతో సహపంక్తి భోజనాలు చేసి సరదాగా గడిపారు. కార్యక్రమంలో నాయకులు దేవిడి శ్యాంరెడ్డి, రంగారెడ్డి, ఎల్లారెడ్డి, కర్రె కోమల్ రెడ్డి, కుశారెడ్డి, లవరెడ్డి, కర్రె ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వనభోజనాలకు వెళ్లిన మహిళలు